నమస్తే తెలంగాణ
నల్లగొండ
3 | నల్లగొండ, శనివారం 8 జూన్ 2024 | NALGONDA

24న ఎంజీయూలో జాతీయ సెమినార్

రామగిరి, జూన్ 7 : తెలంగాణ కామర్స్ అసోసియేషన్, మహాత్మా గాంధీ యూనివర్సిటీ వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఎంజీయూలో ఈ నెల 24న నిర్వహించే జాతీయ సెమినార్‌కు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని కళాశాలల కామర్స్ హెచ్‌ఓడీలు, అధ్యాపకులు రిజిస్ట్రేషన్ చేసుకుని హాజరుకావాలని సెమినార్ కన్వీనర్, ఎంజీయూ డిపార్టుమెంట్ ఆఫ్ కామర్స్ హెచ్‌వోడీ, ఎంజీయూ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆకుల రవి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ కామర్స్ అసోసియేషన్ 5వ వార్షికోత్సవం పురస్కరించుకొని ఎంజీయూలో 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్' అనే అంశంపై నిర్వహించే జాతీయ సెమినార్‌కు దేశంలోని వివిధ యూనివర్సిటీల నుంచి సీనియర్ ప్రొఫెసర్స్, పరిశోధక విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 99483 61250 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

డీఈఈ సెట్‌కు దరఖాస్తులు

రామగిరి, జూన్ 7: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్(డీపీఎస్‌సీ) కోర్సుల్లో 2024-25 విద్యా సంవత్సరానికి నిర్వహించే ప్రవేశాలకు 'డీఈఈ సెట్-2024'కు ఆన్‌లైన్‌లో ఈ నెల 8 నుంచి 30వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నల్లగొండ డీఈఓ బి.భిక్షపతి, డైట్ ప్రిన్సిపాల్ కె.నర్సింహ వేర్వేరు ప్రకటనలో శుక్రవారం తెలిపారు. సెప్టెంబర్1, 2024నాటికి 17 ఏండ్లు పూర్తి చేసుకొని, తగిన విద్యార్హతలు కలిగిన విద్యార్థులు http://deecet.telangana.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులకు జూలై 10, 2024న కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) విధానంలో పరీక్ష ఉంటుందని తెలిపారు.

జోరుగా ఇసుక దోపిడీ

- జాజిరెడ్డిగూడెం, వంగమర్తి నుంచి లారీల్లో తరలింపు
- తట్టెడు ఇసుక తోలనివ్వనన్న ఎమ్మెల్యే సామేల్ ఎక్కడ?
- అక్రమ రవాణాను నిరసిస్తూ వీడియో పోస్ట్ చేసిన అధికార పార్టీ వ్యక్తి
- ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోకపోతే.. ప్రజలు గ్రామాల్లో తిరుగనివ్వరని హెచ్చరిక

ఇసుకను తరలించేందుకు పెద్దఎత్తున నిలిచి ఉన్న లారీలు

సూర్యాపేట, జూన్ 7 (నమస్తే తెలంగాణ) : జాజిరెడ్డిగూడెం, వంగమర్తి ఏటి నుంచి అనుమతులు లేకుండా లారీల కొద్దీ ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నది. పట్టపగలే పెద్ద సంఖ్యలో జేసీబీలతో వాగు పరిసరాల్లో పెద్దఎత్తున ఇసుక డంపులు ఏర్పాటు చేసి లారీలను లైన్‌లో పెట్టి ఇసుకను దూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. గత ఎన్నికల ముందు తట్టెడు ఇసుకను కూడా వాగు నుంచి తీయనీయను అని వాగ్దానం చేసిన స్థానిక ఎమ్మెల్యే మాత్రం గమ్మునుండడం పట్ల అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీకి చెందిన ఓ మాజీ సర్పంచ్ ఇసుక డంపుల వద్దకు వెళ్లి సుమారు 4 నిమిషాల నిడివిగల వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఈ సంఘటన సంచలనంగా మారింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని వంగమర్తి, జాజిరెడ్డిగూడెం ప్రాంతాల్లో ఇసుక పెద్దఎత్తున లభ్యమవుతుంది. గత బీఆర్ఎస్ హయాంలో ఇక్కడ అధికారిక రీచ్‌లు ఏర్పాటు చేసి అవసరాల మేరకు ఇసుకను రవాణా చేసేవారు. అలాంటిది ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ఎలాంటి అధికారిక రీచ్‌లు లేకపోయినప్పటికీ వందలాది లారీల్లో ప్రతినిత్యం సుమారు రెండు కోట్ల రూపాయల విలువ చేసే ఇసుకను తరలిస్తున్నారు.

అక్రమంగా డంపు చేసిన ఇసుకను, లారీలను చూపిస్తున్న కాంగ్రెస్‌కు చెందిన మాజీ సర్పంచ్ నారగోని అంజయ్యగౌడ్

ఎమ్మెల్యేగారు మీరు చెప్పింది ఇదేనా?

కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్ నారగోని అంజయ్యగౌడ్ ఇసుక అక్రమ రవాణా అయ్యే చోటుకు వెళ్లి ఇసుక డంపులు, లారీలు, జేసీబీలను చూపిస్తూ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఆయన వీడియోలో 'ఏడో తారీఖు ఆరోనెల ఇదే రోజు బ్రహ్మాండంగా ఇసుక లారీలు పెద్ద ఎత్తునపోతున్నాయి.. ఎమ్మెల్యేగారూ మీరు గెలవక ముందు చెప్పారు, గెలిచినంక చెప్పారు. దీనిపై మా గ్రామాల వారందరం కలిసి మీకు ఓట్లేసి గెలిపిస్తే మరి మీరు ఎక్కడ పండారు. మూడు రోజుల నుంచి పెద్దఎత్తున ఇసుక రవాణా నడుస్తున్నది. మీరు వెంటనే వచ్చి ఇసుక రవాణాను నిలిపివేయాలని పిలుపునిస్తే మేం కూడా మీ వెంట ఉండి లారీలను నిలిపివేస్తాం. మీరు వెంటనే బంద్ చేయించాలి. లేదంటే ఈ ప్రాంత ప్రజలు మిమ్మల్ని గ్రామాల్లో కూడా తిరుగనివ్వరు. ఇట్లు మీ నారగోని అంజయ్య, లక్ష్మిదేవి కాల్వ, మాజీ సర్పంచ్. ఈ ఏటి వెంట ఉన్న గ్రామాల ప్రజలంతా చైతన్యవంతులు కావాలని విజ్ఞప్తి చేస్తున్నాను' అంటూ ముగించారు.

ఏటిలో రీచ్‌లకు అనుమతి లేదు : తాసీల్దార్

ఇసుక అక్రమ రవాణా విషయమై శాలిగౌరారం తాసీల్దార్ అన్వర్‌హుస్సేన్‌ను వివరణ కోరగా ఏటిలో ఎలాంటి రీచ్‌లకు అనుమతి లేదని, లారీల ద్వారా అస్సలే ఇసుక రవాణా చేయకూడదని తెలిపారు. ఇండ్ల నిర్మాణాలకు మాత్రం ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించేందుకు ఆన్‌లైన్ పద్ధతిన అనుమతులు ఇస్తున్నామని చెప్పారు. లారీల్లో ఇసుక తరలిస్తున్నట్లు తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు.

ఉత్కంఠ పోరులో కాంగ్రెస్ గెలుపు

- పట్టభద్రుల ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న
- రాకేశ్‌రెడ్డి ఎలిమినేషన్‌తో మల్లన్న విజయం
- చివరి వరకు బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి గట్టిపోటీ
- సుదీర్ఘంగా సాగిన కౌంటింగ్ ప్రక్రియ

గెలుపు అనంతరం తీన్మార్ మల్లన్న

నల్లగొండ ప్రతినిధి, జూన్ 7 (నమస్తే తెలంగాణ) : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం సాధించారు. మూడ్రోజులపాటు ఉత్కంఠగా సాగిన ఓట్ల లెక్కింపులో ఎలిమినేషన్ రౌండ్స్‌తో ఆయన విజయం ఖరారైంది. ఆది నుంచి హోరాహోరీగా సాగిన పోరులో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లలో రెండో స్థానంలో ఉన్న రాకేశ్ రెడ్డి ఎలిమినేషన్‌తో మల్లన్నను విజయం వరించింది. పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నికల పోరు మొదటి నుంచి చివరి వరకూ ఆసక్తికరంగా సాగింది. బుధవారం ఉదయం 8 గంటల నుంచి మొదలైన కౌంటింగ్ ప్రక్రియ ఉత్కంఠతను రేకెత్తించింది. ప్రధాన అభ్యర్థులుగా కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ నుంచి రాకేశ్ రెడ్డి, బీజేపీ నుంచి ప్రేమేందర్‌రెడ్డితోపాటు స్వతంత్ర అభ్యర్థులు కలిపి మొత్తం 52 మంది ఉప ఎన్నిక బరిలో నిలిచారు. గత నెల 27న పోలింగ్ జరిగింది. పట్టభద్రుల నియోజకవర్గంలో మొత్తం 4.63లక్షల ఓట్లు ఉండగా, 3,36,013 ఓట్లు పోలయ్యాయి. నల్లగొండ శివారులోని దుప్పలపల్లి వేర్‌హౌసింగ్ గోదాముల్లో మూడ్రోజుల పాటు కౌంటింగ్ సాగింది. బుధవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు మొదలుపెట్టగా గురువారం రాత్రి 10 గంటలకు పూర్తయ్యింది. దాంతో అప్పుడు చెల్లని 27,978 ఓట్లను పక్కన వేసి చెల్లిన ఓట్ల నుంచి గెలుపు కోటాను నిర్ధారించారు. మొత్తం 1,55,095 ఓట్లు సాధించిన అభ్యర్థి గెలుపొందుతారని ప్రకటించారు. గురువారం రాత్రి 10గంటల నుంచి ఎలిమినేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. తొలి ప్రాధాన్యత ఓట్లలో అతి తక్కువ ఓట్లు సాధించిన అభ్యర్థి మొదటగా ఎలిమినేషన్ చేశారు. ఆయనకు వచ్చిన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను పైనుంచి మిగిలిన అభ్యర్థులకు పంచుతూ వచ్చారు. ఇలా మొత్తం స్వతంత్ర అభ్యర్థులుగా ఉండి అత్యధిక ఓట్లు సాధించిన అశోక్‌కుమార్ వరకు సాగింది. ఇక్కడ కూడా గెలుపు కోటాకు అవసరమైన ఓట్లు ఎవరికీ రాలేదు. తొలి ప్రాధాన్యత ఓట్లల్లో 18,865 ఓట్ల ఆధిక్యం సాధించిన తీన్మార్ మల్లన్న ఎలిమినేషన్ రౌండ్స్‌లోనూ ఆధిక్యతను కొనసాగించారు. ఆర్‌వో హాల్‌లో చివరి నుంచి పైకి 48 మంది అభ్యర్థుల ఎలిమినేషన్ ప్రక్రియను చేపడుతూ వచ్చారు. కౌంటింగ్ మరింత ఆలస్యం అవుతున్న కారణంగా శుక్రవారం ఆర్ఓ హరిచందన అభ్యర్థులతో చర్చించి ఏకకాలంలో తొలి ప్రాధాన్యతలో ఎక్కువ ఓట్లు ఉన్న స్వతంత్ర అశోక్‌కుమార్, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేషన్ రౌండ్స్‌ను నాలుగు కౌంటింగ్ హాల్స్‌లో సమాంతరంగా మొదలుపెట్టారు. 49వ అభ్యర్థిగా ఎలిమినేషన్‌కు గురైన అశోక్‌కుమార్ నుంచి అనధికార లెక్కల ప్రకారం... తీన్మార్ మల్లన్నకు సుమారు 9వేల ఓట్లు రాగా, రాకేశ్‌రెడ్డికి 8,700 ఓట్ల వరకు వచ్చాయి. తర్వాత ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేషన్ రౌండ్‌ను చేపట్టారు.

చెల్లని ఓట్లు గణనీయంగా..

పట్టభద్రుల ఎన్నికల్లోనూ ప్రతీ సారి చెల్లని ఓట్లు భారీగా ఉంటుండడం చర్చనీయాంశంగా మారింది. అభ్యర్థుల ప్రచారంలో, సోషల్ మీడియాలో, అధికారికంగానూ ఎంత అవగాహన కల్పిస్తున్నా పట్టభద్రులు ఓటు వేయడంలో తడబాటుకు గురవుతూనే ఉన్నారు. ఈ సారి కూడా 27,978 ఓట్లు చెల్లకుండా పోయాయి. మొత్తం ఓట్లలో ఇవి 8.32శాతంగా ఉన్నాయి. ఇక 2021 మార్చి ఎన్నికల్లో 5.57 శాతంతో 21,636 ఓట్లు చెల్లకుండా పోయాయి. 2015 మార్చిలో జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే 9.14శాతం ఓట్లతో 14,039 ఓట్లు చెల్లలేదు. పోస్టల్ బ్యాలెట్లలోనూ సరైన నిబంధనలు పాటించని కారణంగా పలువురి ఓట్లు చెల్లలేదని తెలిసింది.

ఇందులో రాకేశ్‌రెడ్డి ఆధిపత్యం ప్రదర్శించారు. అనధికార లెక్కల ప్రకారం రాకేశ్‌రెడ్డికి 18వేల పైచిలుకు ఓట్లు రాగా, మల్లన్నకు 13వేల పైచిలుకు ఓట్లు వచ్చాయి. వాటితోపాటు దిగువన ఎలిమినేట్ అయిన అభ్యర్థుల నుంచి సబ్‌పార్సిల్స్‌లో వచ్చిన ఓట్లను సైతం మల్లన్నకు, రాకేశ్‌రెడ్డికి షేర్ చేశారు. ఈ క్రమంలో మల్లన్న గెలుపు కోటా సుమారు ఐదు వేల ఓట్ల దూరంగా నిలిచిపోగా రాకేశ్‌రెడ్డి 20వేల దూరంలో ఉన్నారు. దాంతో రాకేశ్‌రెడ్డిని కూడా ఎలిమినేట్ చేయడంతో మల్లన్న విజయం ఖాయమైంది. తీన్మార్ మల్లన్న విజయం ఖాయం కావడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పటాకులు కాలుస్తూ సంబురాలు చేశారు. ఇది సమష్టి విజయమని తీన్మార్ మల్లన్న వ్యాఖ్యానించారు.

సుదీర్ఘంగా కౌంటింగ్

కౌంటింగ్ ప్రక్రియ సుదీర్ఘంగా సాగింది. ఎలిమినేషన్ రౌండ్స్ కూడా 26గంటలకు పైగా కొనసాగాయి. గురువారం రాత్రి 9గంటల తర్వాత బరిలో ఉన్న అభ్యర్థులందరికీ ముందుగా దీనిపై అవగాహన కల్పించారు. ఆ తర్వాత గెలుపు కోటా సాధన కోసం ఎలిమినేషన్ రౌండ్స్‌ను ప్రారంభించారు. ఆర్ఓ హరిచందన పర్యవేక్షణలో ఎలిమినేషన్ రౌండ్స్‌లో బరిలో ఉన్న మొత్తం 52 మందిలో తక్కువ ఓట్లు కలిగి ఉన్న వారిని ఒక్కొక్కరిని తొలిగించుకుంటూ వారికి వచ్చిన ద్వితీయ తర్వాత ప్రాధాన్యత ఓట్లను మిగిలిన అభ్యర్థులకు పంచుతూ కొనసాగించారు.

శుక్రవారం ఉదయం 12 గంటల వరకు 33 మందే ఎలిమినేట్ కావడంతో సుదీర్ఘ సమయం పడుతుందని ఆలోచించారు. దాంతో ఆర్ఓ హాల్‌లో అశోక్‌కుమార్‌కు దిగువన ఉన్న స్వతంత్ర అభ్యర్థుల ఎలిమినేషన్ రౌండ్స్‌ను కొనసాగిస్తూనే సమాంతరంగా అశోక్‌కుమార్ ఎలిమినేషన్ నాలుగు కౌంటింగ్ హాల్స్‌లో చేపట్టారు. ఆ తర్వాత వెంటనే ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేషన్ రౌండ్ చేశారు. వీరిద్దరితోపాటు అంతకుముందున్న వారి ఎలిమినేషన్ పూర్తయ్యే సరికి రాత్రి 10 గంటలు దాటింది. వీరి ఎలిమినేషన్ అనంతరం అధికారికంగా లెక్కలు తేలేసరికి మరింత సమయం తీసుకుంది. అర్ధరాత్రి రాకేశ్‌రెడ్డి ఎలిమినేషన్‌తో మల్లన్న విజయం ఖరారైంది. దాదాపు 64 గంటలకు పైగా కౌంటింగ్ ప్రక్రియ కొనసాగింది. ఈ కౌంటింగ్‌లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది, అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు ఇలా ప్రతి ఒక్కరూ పూర్తి అలసటగా కనిపించారు.

విలేకరులతో మాట్లాడుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి

సాంకేతికంగా ఓడినా నైతిక విజయం నాదే

- బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి

నీలగిరి, జూన్ 7 : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో సాంకేతికంగా ఓడిన నైతిక విజయం తనదేనని బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి అన్నారు. కౌంటింగ్ హాల్‌లోని మీడియా పాయింట్ వద్ద శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో 32 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, డిప్యూటీ సీఎం, హేమహేమీలైన మంత్రులు ఉన్నా గట్టి పోటీ ఇచ్చామన్నారు. ఎల్లప్పుడూ ప్రజల మధ్యన ఉంటూ వారికోసం పనిచేస్తానని తెలిపారు. పార్టీలకతీతంగా తనకు ఓట్లు వేసిన అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. ఇతర పార్టీలో ఉండి కూడా తనకు సహకరించిన వారు, వివిధ వర్గాల ప్రజలు నా విజయం కోసం ఎదురు చూశారన్నారు. వారి అశలను అందుకోలేకపోయానని తెలిపారు. జేడీ లక్ష్మీనారాయణ లాంటి వాళ్లు కూడా తన గెలుపు కోసం కృషి చేశారని, అయినా ఓడిపోవడం చాలా బాధగా ఉందని చెప్పారు. 12 సంవత్సరాల రాజకీయ జీవితంలో ప్రజలకు సేవ చేయడానికి వచ్చానని, బీఆర్ఎస్‌లో అవకాశం ఇచ్చిన మాజీ సీఎం కేసీఆర్‌కు, తన వెన్నంటి నిలిచిన మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. అతి తక్కువ సమయంలో ఇంతటి ట్రెండ్ సృష్టించి కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టభద్రులకు ఇచ్చిన హామీలపై ప్రజా క్షేత్రంలో పోరాటం చేస్తానన్నారు. బీఆర్ఎస్ పని అయిపోందని చెప్పిన వారందరికీ ఇది ఒక కనువిప్పు అని తెలిపారు.

నేటి నుంచి టీచర్ల బదిలీలు.. పదోన్నతులు

- గతేడాది సెప్టెంబర్‌లో నిలిచిన ప్రక్రియకు గ్రీన్‌సిగ్నల్
- ఈ నెల 30 వరకు పూర్తికానున్న ప్రక్రియ
- ఉమ్మడి జిల్లాలో 11,971 మంది ఉపాధ్యాయులు
- ఒకేచోట 8 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న వారు 8వేలకు పైనే..

రామగిరి, జూన్ 7 : ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 2023 సెప్టెంబర్‌లో నిలిచిపోయిన ప్రక్రియ మళ్లీ షురూ కానుంది. అప్పుడు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల బదిలీలు మాత్రమే జరుగాగా.. జీహెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్స్ పదోన్నతులు, బదిలీలు, ఎస్‌జీటీ బదిలీలు, పండిట్, పీఈటీల అప్‌గ్రేడేషన్స్ కోర్టు కేసుల నేపథ్యంలో నిలిచిపోయింది. వీటిని తిరిగి కొనసాగించేందుకు స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ దేవసేన శుక్రవారం షెడ్యూల్ విడుదల చేశారు. దాని ప్రకారంగా ఈ నెల 8 నుంచి ప్రక్రియ మొదలై 30తో ముగియనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 11,971 మంది ఉపాధ్యాయులుండగా వీరిలో ఆయా ప్రాంతాల్లో ఒకేచోట పనిచేస్తూ లాంగ్ స్టాండ్‌లో 8 సంవత్సరాలు పూర్తి చేసుకుని బదిలీలకు సిద్ధంగా 8వేలకు పైగా ఉన్నారు. బదిలీలు, పదోన్నతులకు ప్రభుత్వ ప్రకటనపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం వ్యక్తం చేస్తున్నారు.

గత షెడ్యూల్ ప్రకారం నల్లగొండ జిల్లాలో 2,774 ఖాళీలు

నల్లగొండ జిల్లాలో ప్రభుత్వ, లోకల్ బాడీ పాఠశాలల్లో ఒకే చోట 8 ఏండ్లు పూర్తి చేసిన ఉపాధ్యాయులు ఉన్న వారి వివరాలు, ఎగ్జిస్టింగ్ క్లియర్ వేకెన్సీను జనవరిలో విడుదల చేశారు. దీంతో ఉపాధ్యాయులకు ఏప్రాంతంలో ఖాళీలు ఉన్నాయనే విషయం స్పష్టం కావడంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, లోకల్‌బాడీ విభాగంలో 2,774 ఖాళీలను చూపించారు. వీటిలో క్లియర్ వేకెన్సీలో 110, లాంగ్‌స్టాండింగ్‌లో 73 చూపించారు. లోకల్‌బాడీ విభాగంలో ఎగ్జిస్టింగ్ క్లియర్ వేకెన్సీలో 1,009, లాంగ్‌స్టాండింగ్‌లో 1,582 మొత్తం 2,591 చూపించగా రెండు విభాగాల్లో కలిపి 2,774 ఖాళీలను ప్రకటించారు. గతేడాది షెడ్యూల్ ప్రకారం ఆయా విభాగాల్లో సీనియారిటీ జాబితాలు, పదోన్నతుల జాబితాలను సైతం సిద్ధం చేశారు.

గతంలోనే దరఖాస్తులకు ఆమోదం

ఉపాధ్యాయుల బదిలీలకు ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా గతంలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. నల్లగొండ జిల్లాలో 4, 416, సూర్యాపేటలో 2,856, యాదాద్రిభువనగిరిలో 2, 260 దరఖాస్తులు వచ్చాయి. వీటన్నింటికీ అధికారులు గతంలోనే ఆమోదం తెలిపారు.

బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఇలా..

- ఈ నెల 8నుంచి 9 వరకు ఆర్‌జేడీ, డీఈఓ కార్యాలయంలో స్కూల్ అసిస్టెంట్ అండ్ సమాన హోదా ఉన్న ప్రొవిజినల్ సీనియారిటీ లిస్ట్, మల్టీ జోన్ -1, స్కూల్ అసిస్టెంట్ ఖాళీలు వెల్లడి. ఎస్‌జీటీ బదిలీల జాబితా విడుదల.
- ఈ నెల 10, 11న ఆయా పోస్టుల విషయంలో ఉపాధ్యాయుల నుంచి వ్యక్తిగతంగా అభ్యంతరాలు స్వీకరణ.
- ఈ నెల 12న డీఈఓ కార్యాలయంలో స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల ఫైనల్ లిస్ట్ వెల్లడి.
- ఈ నెల 13 నుంచి 16వరకు పదోన్నతులకు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్స్‌కు అవకాశం.
- 17న ఎస్‌జీటీ బదీలకు ఖాళీల వెల్లడి.
- 18 నుంచి 20 వరకు ఫైనల్ సీనియారిటీ లిస్టు విడుదల, వెబ్ ఆప్షన్స్, ఎడిటింగ్, ఎస్‌జీటీ సమాన హోదా కేడర్
- 21, 22న బదిలీ కాబడిన ఎస్‌జీటీ టీచర్స్, సమాన హోదా కలిగిన టీచర్స్ ఆర్డర్స్ విడుదల, జడ్పీ అండ్ ప్రభుత్వ మేనేజ్‌మెంట్ వారీగా మల్టీ జోన్ -1
- మల్టీ జోన్ -2 ఈ నెల 8 నుంచి ప్రారంభమై ఈ నెల 30తో ముగుస్తుంది.

గ్రూపు-1 పరీక్షకు సర్వం సిద్ధం

రేపు ఉదయం 10:30 గంటలకు ఎగ్జామ్

- నల్లగొండలో 47 కేంద్రాల ఏర్పాటు.. హాజరుకానున్న 16,899 మంది అభ్యర్థులు
- ఉదయం 10 గంటల తర్వాత ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు
- అభ్యర్థులు చెప్పులు మాత్రమే వేసుకొని రావాలి
- ప్రతి అభ్యర్థికి బయోమెట్రిక్ హాజరు

రామగిరి, జూన్ 7 : టీజీపీఎస్‌సీ ఆధ్వర్యంలో ఈ నెల 9న నిర్వహించే గ్రూప్-1 పిలిమినరీ పరీక్షకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. నల్లగొండ జిల్లా కేంద్రంలో 47 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 16,899 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు అధికారులు వెల్లడించారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో పటిష్టమైన ఏర్పాట్లు చేయగా రెండు రీజినల్ సెంటర్స్‌గా పరీక్ష కేంద్రాలను విభజించారు. రీజినల్ సెంటర్‌కు కో ఆర్డినేటర్‌గా నల్లగొండ ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్, రీజినల్ సెంటర్-1కు కో ఆర్డినేటర్‌గా ఎన్జీ కళాశాల పరీక్ష నియంత్రణాధికారి బి.నాగరాజు వ్యవహరించనున్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేసి కలెక్టరేట్‌లో ప్రత్యేక కమాండెంట్ రూమ్‌లో పర్యవేక్షించనున్నారు. ఉదయం 10:30 నుంచి 1 గంట వరకు పరీక్ష జరుగనుండగా ఉదయం 10 గంటల తర్వాత అభ్యర్థులకు ఎట్టి పరిస్థితుల్లో పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండదని అధికారులు తెలిపారు. పరీక్ష సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అన్ని పరీక్ష కేంద్రాల వద్ద అత్యవసర వైద్య సేవలను అందుబాటులో ఉంచనున్నారు. ఆర్టీసీ ద్వారా అవసరమైన బస్సులను నడపనున్నారు.

అభ్యర్థులకు ముఖ్యమైన సూచనలు

- అభ్యర్థులను ఉదయం 9 నుంచి 10 గంటల వరకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. 10గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతించరు.
- పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించబడవు.
- పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌కు మాత్రమే మొబైల్ ఫోన్ అనుమతి ఉంటుంది.
- ఇంకా హాల్ టికెట్లు రాని అభ్యర్థులు http://www.tspsc.gov.in ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
- అభ్యర్థులు షూస్ కాకుండా చెప్పులు మాత్రమే వేసుకొని రావాలి.
- పరీక్ష పూర్తయ్యేంతవరకు అభ్యర్థులు పరీక్ష కేంద్రం వదిలి వెళ్లకూడదు.
- పరీక్ష కేంద్రం వదిలి వెళ్లే ముందు తప్పనిసరిగా ఓఎంఆర్ ఆన్సర్ షీట్‌ను అప్పగించి వెళ్లాల్సి ఉంటుంది.
- పరీక్ష కేంద్రంలో ఉదయం 9:30 గంటల నుంచి అభ్యర్థుల బయోమెట్రిక్ ప్రారంభమవుతుంది. ప్రతి అభ్యర్థి తప్పనిసరిగా బయోమెట్రిక్ ఇవ్వాలి. ఎగ్జామ్ అయిన తర్వాత వెళ్లే ముందు కూడా బయోమెట్రిక్ వేయాల్సి ఉంటుంది.
- బయోమెట్రిక్ వేయని అభ్యర్థుల మూల్యాంకనం చేయడం జరుగదు.
- పరీక్ష రాసే అభ్యర్థులు మెహందీ వేసుకోవద్దు.

గ్రూప్-1 పరీక్ష మెటీరియల్‌ను స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తున్న సిబ్బంది

సూర్యాపేటకు చేరిన గ్రూప్-1 పరీక్ష పత్రాలు

సూర్యాపేట : ఈ నెల 9న జరిగే గ్రూప్-1 ప్రిలిమనరీ పరీక్ష పత్రాలు, మెటీరియల్ శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. వాటిని కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చారు. అదనపు కలెక్టర్ ప్రియాంక, అదనపు ఎస్పీ నాగేశ్వరరావు సమక్షంలో హైదరాబాద్ నుంచి వచ్చిన వాహనాల సీల్ తీసి పరీక్ష పత్రాల బాక్స్‌లను బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్‌లో పెట్టించారు. స్ట్రాంగ్ రూమ్ చుట్టూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షించనున్నారు. గ్రూప్-1 పరీక్షకు సూర్యాపేటలో 32 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 9,725 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు.

పానగల్‌లో చేపలు కొనుగోలు చేస్తున్న జనం

నేడు మృగశిర కార్తె

- ఒకరోజు ముందు నుంచే చేపల కొనుగోళ్లు

రామగిరి, జూన్ 7 : ప్రకృతిపరంగానే కాకుండా వైజ్ఞానికంగానూ మృగశిర కార్తెకు ప్రత్యేక స్థానం ఉంది. రోహిణి కార్తె ముగియగానే మృగశిర కార్తె ప్రవేశించి ప్రకృతిని చల్లబరుస్తుంది. అన్ని రోజులు ఉన్న వేడిమి, ఉక్కపోతను తగ్గించేలా వాతావరణ పరిస్థితుల్లో మార్పు తీసుకొచ్చి రుతుపవనాలకు స్వాగతం పలుకుతుంది. ఈ క్రమంలో ఆకస్మికంగా సంభవించే వాతావరణ మార్పులకు అనుగుణంగా ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రజలు తమ ఆహార పదార్థాల వినియోగంలో కొన్ని మార్పులు, చేర్పులు చేసుకుంటారు. మృగశిర కార్తె రోజు చేపల వంటకాలు తింటే ఆరోగ్యానికి మంచిదని ప్రజలు వాటిని ఎక్కువగా తీసుకుంటారు. దీని వల్ల రోగ నిరోధక శక్తి పెరిగి ఉబ్బసం తదితర వ్యాధులు రాకుండా చేస్తాయని నమ్మకం. ఇక ఇదే రోజు నాటు కోళ్లు, మేక మాంసం తినేందుకు ఇష్ట పడుతారు. ఈ నేపథ్యంలో చేపలకు గిరాకీ ఎక్కువగా ఉంటుంది. ఒక రోజు ముందు నుంచే చెరువులు, మార్కెట్ల వద్ద చేపల అమ్మకాలు జోరుగా సాగు